నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
శనివారం | ఏప్రిల్ 27, 2024 | www.navatelangana.com

అడవి పంది దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని దేవునిగూడ గ్రామానికి చెందిన అల్లి నాగయ్యపై అడవి పందులు దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగయ్య శుక్రవారం తెల్లవారు జామున పొలానికి వెళ్లి వస్తుండగా అడవి పందులు ఒక్కసారిగా దాడి చేశాయి. దాడిలో అతని కాళ్లు చేతులు, పక్కటెముకలు విరిగిపోవడంతో అతని హుటాహుటిన నాగ్‌పూర్‌లోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. అల్లి నాగయ్యది పేద కుటుంబం కావడంతో అతనిని అటవీ అధికారులు ఆదుకోవాలని కుటుంబ సభ్యులకు కోరుతున్నారు.

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్

జాబ్ కార్డ్ కలిగి ఉన్న ప్రతి కూలీ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జవహర్‌లాల్ సూచించారు. శుక్రవారం మండలంలోని తాడిహత్నూర్, భీంపూర్ గ్రామంలో క్షేత్రస్థాయిలో పని ప్రదేశాల్లో కూలీలు నిర్వహిస్తున్న పనులను పరిశీలించారు. ముందుగా మస్టర్ రోల్‌ను పరిశీలించి కూలీల వివరాలు తెలుసుకున్నారు. ఎండాకాలం నేపథ్యంలో సమయ పాలన పాటించి పనులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జాబ్ కార్డ్ కలిగిన ప్రతి కూలీలకు ఉపాధి హామీ పథకంలో వివిధ పనులు కల్పించాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. పనుల్లో అవినీతికి పాల్పడితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పనుల్లో తీసుకొనే జాగ్రత్తలను కూలీలకు వివరించారు. ఆయన వెంట కార్యదర్శి శేఖర్, ఫిల్డ్ అసిస్టెంట్ మోతీరాం ఉన్నారు.

నిర్లక్ష్యం..అలసత్వం..!

- పెట్రోల్ బంకుల్లో కనిపించని సౌకర్యాలు
- కనీస నిబంధనలు పాటించని యాజమాన్యాలు
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- మామూలుగా తీసుకుంటున్న అధికారులు

జిల్లాల్లోని పెట్రోల్ బంకుల్లో కనీస సౌకర్యాలు కనిపించడం లేదు. వాహనదారులకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని నిబంధనలు చెబుతున్నా ఆయా బంకుల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. కనీసం తాగునీరు లేకపోవడం.. మరుగుదొడ్లు, మూత్రశాలలు మచ్చుకైనా కనిపించకపోవడం, వాహనాల్లో గాలి కొట్టించే సౌకర్యం లేకపోవడం వంటి సమస్యలు కనిపిస్తున్నాయి. నిరంతరం తనిఖీలు చేపడుతూ నిబంధనలు పక్కాగా అమలు చేయించాల్సిన అధికారులు అటువైపు దృష్టిసారించడం లేదు. ఫలితంగా ఆయా బంకులకు వెళ్తున్న వేలాది మంది వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. కనీస సౌకర్యాలు తీర్చుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బంకు యాజమాన్యాలు యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నా పౌరసరఫరాలశాఖ అధికారులు అటువైపు దృష్టిసారించడం లేదు. మామూలుగా తీసుకుంటూ సౌకర్యాలపై కన్నెత్తి చూడటం చూడటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

పెట్రోల్ బంకుల్లో కనీస నిబంధనలు పాటించడం లేదు. ఆయా బంకుల యాజమాన్యాలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. తొలుత అన్ని సౌకర్యాలు కల్పిస్తామని అనుమతులు తీసుకుంటున్న యాజమాన్యాలు బంకులు ప్రారంభించిన తర్వాత వాటిని విస్మరిస్తున్నారు. పెట్రోల్ బంకు ప్రారంభించే సమయంలో తాగునీటి వసతి, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణంతో పాటు వాహనాల టైర్లలో గాలి కొట్టించే పరికరం సైతం అందుబాటులో ఉంచుతారు. అనేక వాటిలో వీటిని ఏర్పాటుచేసి అనుమతులు తీసుకుంటున్నా..కొన్ని బంకులు మాత్రం కేవలం తాగునీటి సౌకర్యం మాత్రం అందుబాటులో ఉంచి అన్ని ఉన్నట్లు అనుమతులు తీసుకుంటున్నారు. తీరా ఏర్పాటుచేసిన తర్వాత ఆయా సౌకర్యాలేమీ కనిపించడం లేదు. మరికొన్ని చోట్ల తాగునీటి డబ్బాను ఏర్పాటుచేసినా అందులో నీళ్ల ఉండటం లేదు. వాటి పక్కన అపరిశుభ్ర వాతావరణం ఉండటంతో తాగేందుకు కూడా ఇష్టపడటం లేదు. మరోపక్క కొన్నింటిలో మినహా అనేక చోట్ల మరుగుదొడ్లు, మూత్రశాలలు మచ్చుకైనా కనిపించడం లేదు. అధికారులు ఎవరూ తనిఖీలు చేయకపోవడం మూలంగా ఆయా బంకుల యాజమాన్యాలు సౌకర్యాలు కల్పించడం లేదనే ఆరోపణలున్నాయి.

వాహనదారుల ఇబ్బందులు..!

పెట్రోల్ బంకుల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 64 పెట్రోల్ బంకులు ఉండగా.. ఉమ్మడి జిల్లాలో పరిధిలో సుమారు 250వరకు ఉంటాయని అధికారవర్గాలు చెబుతున్నారు. వీటి పరిధిలో రోజూ వేలాది వాహనాలు పెట్రోల్, డీజిల్ పోయించుకుంటాయి. ఈ సమయంలో వాహనదారులు, ప్రయాణికులు దాహం వేస్తే తాగునీరు కూడా లభించని పరిస్థితి ఉండటం లేదు. ముఖ్యంగా చాలా చోట్ల మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు అవస్థలు పడాల్సి వస్తోంది. చాలా చోట్ల గాలి కొట్టించే సౌకర్యం లేకపోవడమూ వాహనదారులకు సమస్యగా మారుతోంది. పౌరసరఫరాలశాఖ పరిధిలో ఉండే ఈ పెట్రోల్ బంకుల్లో సౌకర్యాలపై ఆ శాఖ అధికారులు ఆరా తీయాల్సి ఉంటుంది. కానీ మామూలుగా తీసుకుంటూ వీటి వైపు దృష్టిసారించకపోవడం మూలంగా యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలున్నాయి. కిందటేడాది నుంచి అధికారులు తనిఖీలు చేపట్టిన సందర్భాలు కనిపించడం లేదనే విమర్శలున్నాయి. ఎప్పటికప్పుడు పరిశీలన చేపడుతూ పెట్రోల్ బంకుల్లో సౌకర్యాలపై ఆరా తీయాల్సిన అధికారులు అలసత్వం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో గందరగోళం



నవతెలంగాణ-తాండూర్

మండలంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో గందరగోళం నెలకొంది. తాండూర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఇరువర్గాల అంతర్గత ఆధిపత్య పోరు గందరగోళానికి దారి తీసింది. కాంగ్రెస్ నాయకత్వంలో ప్రధాన పాత్ర పోషించిన ఉమ్మడి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహేందర్ రావు బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ తిరిగి చేరికను కాంగ్రెస్ యువ నాయకులు అడ్డుకున్నారు. గడ్డు పరిస్థితిలో కాంగ్రెస్ నుండి బీఆర్ఎస్ వలస వెళ్లిన వారిని తిరిగి కాంగ్రెస్‌లోకి చేర్చుకునేది లేదని ఆందోళన చేపట్టారు. దాంతో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం నెలకొంది. బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణలు కార్యకర్తలకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ లాభం లేకపోయింది. దాంతో జిల్లా అధిష్టానం నిర్ణయం మేరకు చేరికల నిర్ణయం తీసుకుంటామని బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ చెప్పారు.

కష్టకాలంలో పార్టీకి సేవ చేశాను..

తెలుగుదేశం ప్రభుత్వ హాయంలో కాంగ్రెస్ కష్టాల్లో ఉన్నప్పుడు పార్టీకి సేవ చేసానని ఉమ్మడి జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ మురళీధర్ రావు తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను యువకునిగా ఉన్నప్పటి నుండి కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలందించాలని గుర్తు చేశారు. ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ కమిటీలో సభ్యునిగా, జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా పార్టీకి, ప్రజలకు సేవ చేశానన్నారు. అధిష్టానం ఆలోచించి తిరిగి కాంగ్రెస్‌లో చేర్చుకోవాలని కోరారు. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీలోని ఒక వర్గానికి చెందిన నాయకులు తన పలుకుబడిని ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారన్నారు. తన భార్య సల్వాజి ఉమారాణి తాండూర్ సర్పంచ్ పదవితో పాటు మహిళా సంఘాల అభ్యున్నతికి తోడ్పాటునందిస్తూ కాంగ్రెస్ మహిళా నాయకత్వంలో చురుకైన పాత్ర వహించిందన్నారు. తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటే పార్టీ సేవకు అంకితం అవుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి శంకర్ గౌడ్, సీనియర్ నాయకులు వెంకటస్వామి, రహమతుల్లా ఖాన్, ఎమ్మార్పీఎస్, వాల్మీకి సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సత్తా చాటిన విద్యార్థులకు డీఐఈఓ అభినందనలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఆదిలాబాద్ పట్టణంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను కనబర్చారు. శుక్రవారం జిల్లా ఇంటర్ బోర్డు అధికారి రవీందర్‌ను కళాశాల బృందం, విద్యార్థులు ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పుష్పగుచ్ఛం అందిస్తూ అభినందనలు తెలిపారు. హైదరాబాద్ నగరాల వంటి గొప్ప విద్యను అందించడం సంతోషదాయకమని అన్నారు. అనంతరం ద్వితీయ సంవత్సరం చదువుతున్న మార్శెట్టి హరిణి (988), క్యాతం బిందు (988), సక్వీర్ కౌర్ (987), మొదటి సంవత్సరంలో ఆదితిదేశ్ పాండే(467) మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బ్రహ్మం, అరవింద్, జైపాల్‌రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు జీవన భృతి చెల్లించాలి



నవతెలంగాణ-నస్పూర్

మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న నేపథ్యంలో తాము ఆర్థికంగా నష్టపోతున్నామని, ప్రభుత్వం జీవన భృతి నెలకు రూ. 12 వేలు చెల్లించి ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు కోరారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఏఓ రాజేశ్వరరావును కలిసి సమస్యను తెలియజేస్తు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆటో డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. కుటుంబ పోషనే భారంగా మారడంతో రాష్ట్రవ్యాప్తంగా 50 మంది ఆటో కార్మికులు ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఆదుకోవాలని కోరారు. తాము మహాలక్ష్మి పథకానికి వ్యతిరేకం కాదని, ఆ పథకంలో లోపాలు ఉన్నాయని, మహాలక్ష్మి పథకాన్ని కొంత మార్పులుచేర్పులు చేసి ఆటో కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంటరీ ఇన్‌చార్జి చెల్ల విక్రం, మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి పొట్ట మధుకర్, ఎండి షఫీ, సుద్దాల రాజు, మొయ్య రాంబాబు, ఎండి హబీబ్, బుర్ర వెంకటేష్, కల్వల అంజయ్య, ఖలీమ్, మహేష్, శోభన్, సత్యం, రమేష్, మల్లేష్ పాల్గొన్నారు.

ఇండియా కూటమి బలపరిచిన అభ్యర్థిని గెలిపిద్దాం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య

నవతెలంగాణ-మంచిర్యాల

ఇండియా కూటమి బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణని గెలిపించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య తెలిపారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో శుక్రవారం గోమాస ప్రకాశ్ అధ్యక్షతన జరిగిన పార్టీ జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ దేశవ్యాప్తంగా ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న సందర్భంలో తెలంగాణ రాష్ట్రంలో 17 పార్లమెంట్ స్థానాల్లో, ఒక స్థానం భువనగిరిలో సీపీఐ(ఎం) పోటీ చేస్తుందన్నారు. మిగిలిన 16 స్థానాలలో ఇండియా కూటమిలో అంతర్భాగంలో భాగంగా కాంగ్రెస్‌ను బలపరచాలని పార్టీ నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా పెద్దపల్లి పార్లమెంట్‌కు సంబంధించి ఇండియా కూటమి బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణని గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గడ్డం వంశీకృష్ణకు సంపూర్ణ మద్దతును సీపీఐ(ఎం) తెలుపుతుందని, అలాగే పార్టీ శ్రేణులు, ప్రజాసంఘాలు కూడా పెద్ద మొత్తంలో ఎన్నికల క్యాంపెన్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పదేండ్ల పాలనలో కేంద్రంలో ఉన్న బీజేపీ మోడీ ప్రభుత్వం అనేక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించిందని, కార్పొరేట్లకు ప్రభుత్వ రంగాన్ని కూడా కట్టబెట్టిందని ఆరోపించారు. ప్రభుత్వ సంస్థలన్నిటిని కూడా విధ్వంసం చేస్తుందన్నారు. మతోన్మాద ఏజెండాను ముందుకు తీసుకువచ్చి భారత రాజ్యాంగాన్ని రద్దుచేసి, మనుస్మృతి, చాతుర్ వర్ణ వ్యవస్థను తీసుకురావాలని పరోక్షంగా ఆర్ఎస్ఎస్ కనుసందాలలో ఈరోజు మోడీ పని చేస్తున్నారని తెలిపారు. అందుకోసం ఈ దేశాన్ని రక్షించుకోవాలన్న, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించి మోడీ ప్రభుత్వాన్ని ఓడించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, గిరిజనులకు తీవ్రమైనటువంటి అన్యాయం చేస్తున్నారు. రిజర్వేషన్లను కొల్లగొడుతున్నారు. ఓబీసీలకు చట్టసభలలో రిజర్వేషన్లు ఇవ్వలేదని, కేంద్రంలో మంత్రివర్గం లేదని, కులగణన చేపట్టకుండా కేంద్రం అడ్డుకుంటుందని మండిపడ్డారు. కార్మిక చట్టాలను రద్దుచేసి, నల్ల చట్టాలను తీసుకువచ్చి కార్మికుల హక్కులను లేకుండా చేస్తుందని ఆరోపించారు. రైతులు, కార్మికులు, ప్రజలు అన్ని వర్గాల ప్రజలు బీజేపీని ఓడించడానికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి సంకె రవి, కార్యదర్శివర్గ సభ్యులు దాసరి రాజేశ్వరి, ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు దుంపల రంజిత్ కుమార్, బొడెంకి చందు, రాజారాం, దూలం శ్రీనివాస్ పాల్గొన్నారు.

జానెడు పొట్ట కోసం కొండంత సాహసం



నవతెలంగాణ-ఇచ్చోడ

ప్రమాదం అని తెలిసినా జానెడు పొట్ట కోసం కొండంత సాహసం చేస్తున్నారీ దంపతులు. ఇద్దరు కలిసి ఎక్సెల్ 100 లూనాపై శుక్రవారం ఉదయం చెత్త ఏరడానికి వెళ్లి, క్వింటాల్ సంచీ పరిమాణంలో చెత్త కాగితాలు, పాత సామాన్లు రెండు సంచులో నింపుకొని లూనాపై కట్టుకున్నారు. దానిపై భార్యను కూర్చోపెట్టుకొని ఇచ్చోడ వైపు నుంచి జిల్లా కేంద్రానికి వస్తున్నారు. పొట్టకూటి కోసం వీరు సాహసమే చేస్తున్నారు.

ఎన్నికల నేపథ్యంలో కట్టుదిట్టమైన చర్యలు

- ఎస్పీ గౌస్ ఆలం
- పట్టణంలో ముమ్మర తనిఖీలు



ఎస్పీ పర్యవేక్షణలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లాలో మాదకద్రవ్యాలను సంపూర్ణంగా రూపుమాపాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా సీఆర్పీఎఫ్, డాగ్ స్క్వాడ్ సిబ్బందితో మాదకద్రవ్యాలను గుర్తించే విధంగా తనిఖీలను నిర్వహించారు. ముందుగా ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, ఠాకూర్ హోటల్ వద్ద గల ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఠాగూర్ హోటల్ వద్ద పట్టణంలోకి వచ్చే వాహనాలను బస్సులను తనిఖీ చేసి జిల్లాలోనికి ఎటువంటి మద్యం, డబ్బు, గంజాయి, మాదకద్రవ్యాలు రాకుండా పటిష్టమైన తనిఖీ నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు. సిబ్బంది 24 గంటలు అప్రమత్తతో ఉంటూ ఎటువంటి డబ్బు, మద్యం, గంజాయి, ఓటర్లను ప్రభావితం చేసే బహుమతులు వాటిని అనుమతించకూడదని ఎస్పీ తెలియజేశారు. వాహనాలు తనిఖీల క్రమంలో వీడియోగ్రఫీ తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ఈ తనిఖీలలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, టూ టౌన్ సీఐ ఏ.అశోక్ పాల్గొన్నారు.

పోల్ చిట్టీల పంపిణీ పరిశీలించిన ఏఆర్ఓ

నవతెలంగాణ-జైపూర్



పార్లమెంట్ ఎన్నికల నిర్వాహణలో భాగంగా ఓటర్లకు సంబంధించిన పోల్ చిట్టీల పంపిణీ తీరును చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ చంద్రకళ పరిశీలించారు. జైపూర్ తహసీల్దార్ వనజా రెడ్డితో కలిసి శుక్రవారం నర్వ గ్రామ పంచాయంతీ పరిధిలో కొనసాగుతున్న పోల్ చిట్టీల పంపిణీ తీరుపై కుటుంబాల వారిని కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నర్వ గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ నెంబర్ 97 పరిశీలించి ఏఆర్ఓ పోలింగ్ స్టేషన్ పరిసరాలు పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ల పరిధిలో గల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా తెలిపారు.

హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలం

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్
- దేవాపూర్‌లో బీఆర్ఎస్ విస్తృత ప్రచారం



నవతెలంగాణ-కాసిపేట

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం కాసిపేట మండలంలోని దేవాపూర్ మేజర్ గ్రామ పంచాయతీలో బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో విస్తృత ప్రచారం నిర్వహించారు. దీంతో పాటు ఓరియంట్ కంపెనీ కార్మికులను కలిసి వారితో మాట్లాడి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకమని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి కార్పొరేట్ వ్యాపారస్తులని, వారికి ప్రజలను కలిసి సమస్యలు పట్టించుకునే తీరక ఉండదని, అసలు ప్రజలను పట్టించుకోరని, ప్రజలు దీనిని గమనించాలన్నారు. హామీలు అమలు చేయడంతో కాంగ్రెస్ పార్టీ విఫలమైందన్నారు. ప్రజలు ఇప్పటికే అనుకుంటున్నారని, ప్రజల మధ్య చర్చ నడుస్తుందన్నారు. కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంను పోగట్టుకున్నామని ప్రజలు బాధపడుతున్నారన్నారు. బీఆర్ఎస్‌తోనే ప్రజలకు మేలు జరుగుతుందని, ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావు, ఓసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, మాజీ సర్పంచ్లు ఆడె జంగు, ఆడె బాదు, మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, బీఆర్ఎస్ కార్యదర్శి మోటూరి వేణు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాంటెంకి వాల్దేవ్, దండవేణి చందు, కైలాస్, వద్దూరి మల్లేశ్, ఏనుగు సుధాకర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శనివారం | ఏప్రిల్ 27, 2024 | www.navatelangana.com

ఆన్‌లైన్ ఆర్థిక నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

నవతెలంగాణ-పెంబి



ఆన్‌లైన్ మాధ్యమంగా జరిగే ఆర్థిక నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై శంకర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఫ్యాక్స్ సొసైటీ భవనంలో ప్రజలకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా మీకు ఫోన్ చేసి మీ బ్యాంకు ఖాతా బ్లాక్ అయిందని మళ్ళీ ఆక్టివేట్ చేయడానికి మీ ఏటీఎం వివరాలు అడిగితే తెలియజేవద్దని సూచించారు. బ్యాంకు ఖాతా, ఏటీఎంలకు సంబంధించిన వివరాలు బ్యాంకు అధికారులు అడగరని, అలాంటి ఫోన్ కాల్స్ వచ్చిన వెంటనే సైబర్ క్రైం టోల్ ఫ్రీ నంబరు 1930కు కాల్ చేస్తే కేసు రిజిస్టర్ చేసి నేరస్తులపై సత్వర చర్యలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్ కుమార్, ఫ్యాక్స్ సొసైటీ డైరెక్టర్ సుధాకర్, ప్రజలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.1.90లక్షల నగదు పట్టివేత

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలోని చించోలి(బి) ఎక్స్ రోడ్డు వద్ద శుక్రవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో బోరిగామ్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న బోరిగామ్ గ్రామానికి చెందిన పత్తిరెడ్డి పోతారెడ్డి వాహనంలో రూ.1.90 లక్షల ఎలాంటి ధృవ పత్రాలు లేకుండా తీసుకెళుతున్న నగదును ఎస్సై చంద్రమోహన్ పట్టుకున్నట్టు తెలిపారు. ఆ నగదును నిర్మల్ కలెక్టరేట్ గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్టు ఎస్సై తెలిపారు. ఈ తనిఖీల్లో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఆదివాసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఈనెల 28న కేంద్ర ప్రభుత్వ గిరిజన విధానాలు-ఆదివాసులపై ప్రభావం అనే అంశంపై ఆదివాసీ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉయిక విష్ణు పూసం సచిన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఆదివాసీ సంఘాలు, పటేల్లు, రాయి సెంటర్ సార్మేడిలు, యువజన సంఘాలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ పరిశీలన

- ఎంపీడీఓ రాజ్‌వీర్



నవతెలంగాణ-నేరడిగొండ

ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీఓ రాజ్‌వీర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఎల్‌ఓలు ఓటరు స్లిప్పులను సక్రమంగా పంచాలని అన్నారు. ఇంట్లోని చిన్న పిల్లలకు ఓటరు స్లిప్పులను ఇవ్వద్దొన్నారు. ఇంటి పక్కవారికి కూడ ఇవ్వదని బీఎల్‌ఓలకు సూచించారు. సంబంధిత వ్యక్తులకు మాత్రమే ఓటరు స్లిప్పులను అందజేయాలన్నారు. వారు లేకపోతే మరుసటి రోజు ఇవ్వాలని అన్నారు. అ స్లిప్పుల పంపిణీని ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు.

ప్రచార రథాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మోసపూరిత మాటలతో ప్రజలను నమ్మించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంపీ ఎన్నికలలో ప్రజలే తమ ఓట్లతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నరని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును, కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మొదట దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, రథాన్ని ప్రారంభించారు. అనంతరం కార్యకర్తలతో కలిసి దుర్గానగర్‌లో ఓటర్లను కలిసి ఆత్మీయంగా పలుకరించారు. కారు గుర్తుకు ఓటేయాలని కాలనీ వాసులను కోరారు.

సివిల్ ర్యాంకర్ శుభంకు సన్మానం



నవతెలంగాణ-ఉట్నూర్

ఇటీవల వెలువడిన సివిల్స్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించిన ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ గ్రామానికి చెందిన రేకులవార్ శుభంను ఆయన తండ్రి రేకులవార్ సత్యనారాయణను శుక్రవారం పట్టణంలోని సన్‌షైన్ పాఠశాలలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించి తల్లీతండ్రుల పేర్లను నిలబెట్టావని అన్నారు. ఈ కార్యక్రమంలో గోపి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోయా పంట పరిశీలన



నవతెలంగాణ-తాంసి

మండలంలోని వడ్డాడి గ్రామానికి చెందిన రైతులు వేసవి కాలంలో పండించే పంటలో భాగంగా సోయాబీన్ పంటలను సాగు చేయడం జరిగింది. ప్రముఖ కంపెనీకి చెందిన గాయత్రీ సీడ్స్ పేరుతో గల సోయా విత్తనాలను కొనుగోలు చేసి, జనవరిలో చేనులో వేసుకున్నారు. ఏప్రిల్ వరకు కాత కాయలేదు, కంపెనీ ప్రతినిధులను విచారించగా వారి నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో వ్యవసాయ శాఖ అధికారుల సమాచారం అందించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సోయాబీన్ పంట చేనును రైతులతో కలిసి పరిశీలించారు. రైతులు వేసిన విత్తనాలను ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించి, రైతులకు నష్టపరిహారం అందే విధంగా చూస్తామని అన్నారు. వారి వెంట మాజీ సర్పంచ్ శ్రీనివాస్, రైతులు ఉన్నారు.

ఆదివాసీ, గిరిజన గూడాల్లో ప్రచారం



ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ

నవతెలంగాణ-నేరడిగొండ

ఆదివాసీ, గిరిజన గూడాల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ శుక్రవారం ప్రచారం నిర్వహించారు. మండలంలోని రెంగన్‌వాడీ, బొందిడి, రోల్ మామడ, గుత్పాల తదితర ఆదివాసీ, గిరిజన గూడాల్లో నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్‌తో కలిసి విస్తృత ప్రచారం చేశారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా, పేదింటి ఆదివాసీ బిడ్డగా తనను ఆశీర్వదించి నష్టం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా గొండీ బాషలో మాట్లాడిన సుగుణ కాంగ్రెస్ పథకాలను ప్రజలకు వివరించారు. పోడు భూములకు పట్టాలు, గ్రామాల్లో రహదారుల నిర్మాణం, మౌళిక వసతులు కల్పించి, అర్హులందరికీ పెన్షన్ ఇచ్చే బాధ్యత కాంగ్రెస్‌దని అన్నారు. ఆగస్టు 15లోపు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని అన్నారు. అంతక ముందు ఆదివాసీ మహిళలు ఆత్రం సుగుణకు మంగళ హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. వారిని ఎంపీ అభ్యర్థి ఆప్యాయంగా పలకరించి, చెయి గుర్తుకు ఓటు వేసి, తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు ఆత్రం భాస్కర్, పసుల చంటి, మండల అధ్యక్షుడు ఆడే వసంత్, స్థానిక సర్పంచులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగమే ఈ దేశానికి దిక్సూచి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- రాజ్యాంగం కాపాడబడాలంటే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలి
- ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఉట్నూర్

భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, రాజ్యాంగంను కాపాడాలంటే కేంద్రంలో కాంగ్రెస్‌ను అధికారంలో తెవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో మండల నాయకులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీని ఏ విధంగా అధికారంలో తేవాలనే అంశంపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో పదేండ్లుగా జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకొని, కార్యకర్తలు గ్రామగ్రామాన గడపగడపకు తిరిగి కాంగ్రెస్ గ్యారంటీలను ప్రచారం చేస్తూ పార్టీని అధికారంలో తేవడానికి అహర్నిశలు కృషి చేయాలన్నారు. రాజ్యాంగమే ఈ దేశానికి రక్షని అలాంటి గొప్ప రాజ్యాంగాన్ని మతోన్మాదుల నుండి కాపాడాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందన్నారు. దేశం కోసం త్యాగం చేసిన త్యాగధనుల కుటుంబం నుండి వచ్చిన నిజమైన దేశ భక్తుడు రాహుల్ గాంధీ అని ఆయనను ప్రధానిని చేయడమే మన లక్ష్యం కావాలన్నారు. రాబోయే ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించి కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలో సాదరంగా ఆహ్వానించారు. నాయకులతో కలసి 5 న్యాయ కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా, మండల, గ్రామ, బూత్ స్థాయి, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం

- ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి జోగు రామన్న



ప్రచారంలో భాగంగా ఓటర్లతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమయిందని, ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తే హామీలు అమలవుతాయంటూ ఆ పార్టీ నేతలు వ్యాఖ్యలు చేయడం వారి చిత్తశుద్ధికి నిదర్శనమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. స్థానిక దుర్గానగర్‌తో పాటు పలు కాలనీలలో ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని అభ్యర్థించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల తీరును వివరించారు. ఈ సందర్భంగా జోగురామన్న మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బూటకపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమయిందని ఆరోపించారు. మహిళలకు రూ.2500 పెన్షన్, కళ్యాణ లక్ష్మీ కింద తులం బంగారం వంటి హామీలను బుట్టదాఖలు చేసిందని మండిపడ్డారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తేనే పథకాలు కొనసాగుతాయని వ్యాఖ్యలు చేస్తున్నారంటూ ధ్వజమెత్తారు. ప్రజల ఆకాంక్షలను గుర్తించలేని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అలాల్ అజయ్, యూనుస్ అక్బని, సంద నర్సింగ్, ధమ్మపాల్, కొండ గణేష్, భూమన్న, స్వరూప, పర్వీన్, దాసరి రమేష్, విజ్జగిరి నారాయణ, పండ్ల శ్రీను, వేనుగంటి ప్రకాష్, సంజయ్ పాల్గొన్నారు.

దుర్గామాత అలయంలో పూజలు

పట్టణంలో లోక్ సభ ఎన్నికల ప్రచార పర్వాన్ని పార్టీ శ్రేణులు శుక్రవారం ప్రారంభించిన నేపథ్యంలో స్థానిక శ్రీ నవశక్తి దుర్గా పీఠాన్ని బీఆర్ఎస్ జిల్లా అధక్షుడు జోగు రామన్న దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ కిషన్ మహారాజ్ వేద మంత్రోచ్చారణల నడుమ పూజలు జరిపి అమ్మవారిని ఆరాధించారు. ప్రత్యేక హారతులు అందచేసి పండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు. అనంతరం ప్రచార రథాలకు పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అలాల్ అజయ్, సంద నర్సింగ్, ధమ్మపాల్, కొండ గణేష్, భూమన్న, దాసరి రమేష్, విజ్జగిరి నారాయణ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృత్యువాత



నవతెలంగాణ-తలమడుగు

కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లలు మృతి చెందిన సంఘటన మండలంలోని దేవాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గొర్రెల కాపరి, యజమాని గంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి గొర్రెల యజమాని గంగారెడ్డి ఎప్పటిలాగా తమ గొర్రె మందను తీసుకొని అటవీ ప్రాంతంలో మేపుకొని గురువారం సాయంత్రం ఇంటికి తీసుకువచ్చి పాకలో ఉంచగా, ఊర కుక్కలు పాకలో చొరబడి 15 గొర్రె పిల్లలను చంపెశాయి. వాటి విలువ దాదాపు రూ.50 వేల వరకు ఉంటుందని తెలిపారు. పశువైద్యాధికారి దూద్‌రాం సమాచారాన్ని అందించారు. సంఘటన స్థలానికి చేరుకొని గొర్రె పిల్లలను పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్టు ధృవీకరించారు. వాటి విలువ రూ.50 వేల వరకు ఉంటుందని డాక్టర్ తెలిపారు. అనంతరం గొర్రె పిల్లలను పోస్టుమార్టం నిర్వహించారు. యజమాని తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

డివిజన్ టాపర్‌గా హేమగీత

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్ గ్రామానికి చెందిన చౌహాన్ హేమగీత ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో బైపీసీ ఫస్ట్ ఇయర్‌లో 440 మార్కులకు గాను, 431 మార్కులు సాధించి డివిజన్ టాపర్‌గా నిలిచింది. ఉట్నూర్ గురుకుల కళాశాలలో చదువుతోంది. మంచి మార్కులు సాధించడంతో ఆమెను గ్రామస్తులు పలువురు అభినందించారు. ముమ్ముందు మంచి మార్కులు సాధించి లక్ష్యాన్ని చేరుకోవాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

గడపగడపకు బీఆర్ఎస్ ప్రచారం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని లింగుగూడ, దార్‌లొద్ది గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని ఇంటింటికీ నిర్వహించి, కారు గుర్తుకు ఓటేయాలని బీఆర్ఎస్ నాయకులు కుమ్ర రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, అభివృద్ధి చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మెస్రం పరమేశ్వర్, మాజీ సర్పంచులు సిడం లక్ష్మణ్, దుర్వ రాంచందర్, కొడప మాధవ్, మరప రాంచందర్, పీఏసీఎస్ డైరెక్టర్ సిడం గణపతి, మోతీరాం పాల్గొన్నారు.

మేడేను ఘనంగా నిర్వహించాలి



నవతెలంగాణ-ఇచ్చోడ

ప్రపంచ కార్మికుల దినోత్సవ వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. భవన నిర్మాణ సంఘం మండలాధ్యక్షుడు గొలుసుల లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం ఇచ్చోడ మండల కేంద్రంలో మేడేకు సంబంధించిన గోడపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 138 మేడే దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి వెళ్లేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి కల్లేపల్లి గంగయ్య, భవననిర్మాణ కార్మికులు బొజ్జ రాజకుమార్, గోపి, శివకుమార్, లక్ష్మణ్, రాంజీ, గురువయ్య పాల్గొన్నారు.

వేతనాలు రావనే అపోహలొద్దు



నవతెలంగాణ-నేరడిగొండ

వేతనాలు రావనే అపోహలో పడొద్దని ఎంపీడీఓ రాజ్‌వీర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కొరిటికల్(బి) గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజ్‌వీర్ మాట్లాడుతూ ఇంతకు ముందు పనిచేసిన వేతనాలు కొంచెం లేటయ్యాయని ఇప్పుడు అలా జరుగడం లేదని అన్నారు. పనిచేసిన వారంలోగా కూలీ డబ్బులు వస్తున్నాయని అన్నారు. ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ పనులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

రైలుతో పాటు పలు వాహనాల తనిఖీలు



నవతెలంగాణ-తలమడుగు

మండలంలో రైలుతో పాటు పలు వాహనాలను శుక్రవారం ఎస్సై ధనశ్రీ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు చేపట్టినట్టు ఎస్సై తెలిపారు. కోసాయి రైల్వే స్టేషన్ నుంచి భోగిలను తనిఖీ చేసుకుంటూ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ వరకు అన్ని భోగిలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేశారు. మహారాష్ట్ర నుంచి అక్రమంగా దేశీదారు, మద్యం రవాణా కాకుండా గట్టి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలో ప్రచారానికి వచ్చిన బీఆర్ఎస్ వాహనాన్ని తనిఖీ నిర్వహించారు. ఎంతటి వ్యక్తులైన సరే ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సై వెంట పోలీస్ సిబ్బంది అశోక్, రామ్‌రెడ్డి, ప్రహ్లాద్, ప్రభాకర్ ఏఆర్ కానిస్టేబుల్ ఉన్నారు.

రూ.98వేల 600 నగదు స్వాధీనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.98వేల 600 నగదును మావల పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికల సందర్భంగా శుక్రవారం మావల బైపాస్ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఇంద్రవెల్లికి చెందిన కల్లూరి అశ్విన్‌ను తనిఖీ చేయగా రూ.98వేల 600 నగదు లభించినట్టు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. రూ.50 వేలకు పైగా నగదు తీసుకెళ్లేటప్పుడు దానికి సంబంధించిన పూర్తి ఆధారాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు. లేనట్లయితే స్వాధీనం చేసుకుంటామని పేర్కొన్నారు.

నవతెలంగాణ
నమ్మకమైన తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | ఏప్రిల్ 27, 2024 | www.navatelangana.com

ఐచర్ వ్యాన్ బోల్తా

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



చింతలమానెపల్లి మండల కేంద్రం నుండి కరీంనగర్ వెళ్తున్న మక్కల లోడ్ ఐచర్ వ్యాన్ కాగజ్‌నగర్ మండలంలోని అరెగూడ సమీపంలో శుక్రవారం అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయలయ్యాయి. ప్రత్యేకసాక్షుల కథనం ప్రకారం...చింతలమానెపల్లి మండల కేంద్రానికి చెందిన నూకల కొండయ్యకు చెందిన ఐచర్ వ్యాన్ మక్కల లోడుతో కరీంనగర్ వెళ్తుండగా వ్యాన్ స్టీరింగ్‌లో సాంకేతిక లోపం ఏర్పడటంతో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్ బోయిరె శ్రీనివాస్‌కు స్వల్పగాయలయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

నవతెలంగాణ-తాండూర్

రాజ్యాంగంలో కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మాండలంలోని 37 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన 27209 ఓటర్ స్లిప్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 128,129 పోలింగ్ కేంద్రాలలో ఓటర్ల సౌకర్యార్థం మార్పు చేయడం జరిగిందన్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, తాండూర్ గ్రామం పోలింగ్ కేంద్రాన్ని విద్యాభారతి హై స్కూల్‌కు కిష్టంపెట్ తాండూర్ మండలం, 137 కొత్తపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం గల పోలింగ్ బూత్‌ను గ్రామా పంచాయతీ కార్యాలయం రాజీవ్ నగర్‌కు మార్చడం జరిగిందని తెలిపారు. ఈ పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లు నూతన పోలింగ్ కేంద్రాల వద్ద ఓటును వినియోగించుకొవాలని ఓటర్లకు సూచించారు. ఇప్పటి వరకు 37 పోలింగ్ స్టేషన్ల పరిధిలోని 1,28,129 మంది ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మురళీధర్ రావు, పోలింగ్ బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది ఆరోగ్యమే ప్రధాన లక్ష్యం

- ఆర్ఎం సోలేమాన్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్యమే సంస్థ ప్రధాన లక్ష్యమని ఆర్టీసీ ఆర్ఎం సోలేమాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డిపో ఆవరణలో ఆర్టీసీ ఉద్యోగులకు డిపో మేనేజర్ విశ్వనాథ్ అధ్యక్షతన నిర్వహించిన గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ 2.0 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమే లక్ష్యంగా హెల్త్ చెకప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 30 తారీఖు వరకు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉద్యోగుల ఆరోగ్యం విషయంలో సంస్థ ఎలాంటి అలసత్వం వహించదన్నారు. డిపో మేనేజర్ విశ్వనాథ్ మాట్లాడుతూ డిపోలో 331 మంది ఆర్టీసీ ఉద్యోగులు, 57 మంది అద్దె బస్సు డ్రైవర్లు ఉన్నారని వీరందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు సలహాలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఆర్టీసీ ఉద్యోగి ఈ హెల్త్ చెకప్‌కు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో హెల్త్ వాలంటరీలు శ్రావణ్ కుమార్, ప్రేమల పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఎమ్మెల్యే హరీష్ చేయూత



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని కోయవాగు గ్రామానికి చెందిన సయ్యద్ చోటు మియా కుమార్తె వివాహానికి సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఆర్థిక సాయం అందించారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో శుక్రవారం కార్యకర్తలు జాడి దీపక్, రావుల నరేష్ ఆర్థిక సాయం అందజేశారు. పేదలకు అండగా ఉంటూ వారి కష్టసుఖల్లో ఎమ్మెల్యే పాల్గొనడం సంతోషంగా ఉందని పలువురు నాయకులు అన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని మహిళా సాధికారిత కేంద్ర జెండర్ స్పెషలిస్ట్ రాణి తెలిపారు. శుక్రవారం మండలంలోని చిలాటిగూడలో ఉపాధి హామీ కూలీలకు బాల్య వివాహాలు, ఆర్థిక అక్షరాస్యతపైన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల పట్ల అందరికి అవగాహన ఉండాలని, అమ్మాయికి 18 సంవత్సరాలు అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తరువాతనే వివాహం చేయాలనీ సూచించారు. వయసు నిండకముందు వివాహం చేస్తే వారు శిక్షార్హులు అవుతారన్నారు. బాల్య వివాహాలను ఎవ్వరు కూడా ప్రోత్సహించవద్దని సూచించారు. ఎక్కడైనా బాలవివాహాలు జరిగితే 1098 నెంబర్‌కి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. మహిళలు పనిచేసే చోట లైంగిక వేదింపులు, గృహ హింసకి గురైతే 181 నెంబర్‌కి ఫోన్ చేయవచ్చని, ఆడపిల్లలను చదువుతో పాటు అన్ని రంగాల్లో అబ్బాయిలతో సమానంగా పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ రాజేశ్వరి, ఫైనాన్సియల్ లిటరసీ సాగర్, గ్రామ కార్యదర్శి సుమలత, పోస్ట్ మెట్రిక్ బీసీ బాలుర వసతి గృహ సంక్షేమ అధికారి మధుకర్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుని మృతి

నవతెలంగాణ-రెబ్బెన

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. సిర్పూర్(టి) మండలంలోని చిల్లపల్లి గ్రామానికి చెందిన వాసాక భిక్షపతి(29) మండలంలోని గంగాపూర్ గ్రామంలో బంధువుల ఇంట్లో వివాహానికి స్కూటిపై బయల్దేరాడు. ఇందిరానగర్ వద్ద వీరి స్కూటి వాహనాన్ని వెనక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో స్కూటీపై ప్రయాణిస్తున్న భిక్షపతి, పరశురాంలకు గాయాలయ్యాయి. గాయపడిన వీరిద్దరిని రెబ్బెన మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన వసాకే భిక్షపతిని మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మరో క్షతగ్రాతుడు పరశురాం ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. మృతుడి తల్లి వసకే గిరిజాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

అతివేగం..తీస్తోంది ప్రాణం..!

- కుటుంబాల్లో విషాదం నింపుతున్న రోడ్డు ప్రమాదాలు
- నిర్లక్ష్యానికి గాలిలో కలిసిపోతున్న నిండు ప్రాణాలు
- డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడుతున్నా మారని తీరు

అతివేగం ప్రమాదకరమని వాహనాల వెనుక రాసి ఉండటం గమనిస్తుంటాం. దానికి కేవలం సూక్తిగానే భావిస్తుంటారు. కానీ ఇది నిజజీవితంలో అందరికీ వర్తిస్తుందనే విషయాన్ని మాత్రం తెలుసుకోలేపోతుంటారు. అతివేగం ఫలితంగా అనేక ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతున్నాయి. చిన్నపాటి నిర్లక్ష్యం మూలంగా ప్రాణాలు పోవడంతో తండ్రికి బిడ్డను..బిడ్డకు తండ్రిని దూరం చేస్తున్నాయి. అతివేగం వద్దని వాహనదారులకు ఎంతగా అవగాహన కల్పిస్తున్నా.. పూర్తి నియంత్రణ సాధ్యం కావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా మద్యం మత్తులోనూ వాహనాలు నడపడం మూలంగా తరుచూ ప్రాణాలు పోవడం.. అవయవాలు విరిగిపోవడం కారణంగా ఏండ్ల తరబడి మంచానికే పరిమితం కావాల్సి వస్తోంది. ఇలాంటి ఘటనలు జరుగుతున్నా వీటి నుంచి గుణపాఠాలు నేర్చుకోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.



గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన ద్విచక్ర వాహనాలు

నవతెలంగాణ- బెజ్జూర్

తొందరపడకండి..నిదానంగా వెళ్లండి.. క్షేమంగా తిరిగి రండి అని పెద్దలు తరుచూ చెబుతుంటారు. పోలీసుల ప్రకటనలోనూ ఇలాంటి సూక్తులు కనిపిస్తుంటాయి. వీటిని చదువుతున్న..వింటున్న వాహనదారులు కేవలం ప్రకటనలు మాత్రమే అనుకుంటున్నారు. ఇవి నిజజీవితంలోనూ పాటించాలని భావించడం లేదు. వీటిని నిజంగా పాటిస్తున్న వారు మాత్రం తరుచూ దూర ప్రయాణాలు చేస్తున్నా క్షేమంగా ఇంటికి తిరిగి వెళ్తున్నారు. పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే వారు మాత్రం ప్రమాదాల బారినపడుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తాజాగా బెజ్జూర్ మండలంలోని కోర్తగుడా గ్రామ సమీపంలో గురువారం రాత్రి చోటుచేటుకున్న రోడ్డు ప్రమాద ఘటన మూడు కుటుంబాల్లో విషాదం నింపింది. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. అర్కగూడ గ్రామానికి చెందిన ఆత్రం మహేష్ (25) బారేగూడకు చెందిన తొర్రం వెంగల్‌రావు (30) బూరుగుగూడలో తమ బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వెళుతున్న క్రమంలో ఎలుక పెళ్లికి చెందిన దున్న నరసింహ(20), ఆయిల నిఖిల్, శనిగారం రాజ్‌కుమారు బారేగూడ వైపు వివాహ విందుకు వెళుతున్న క్రమంలో అతివేగంగా వాహనాలు నడపడంతో ఎదురెదురుగా వాహనాలు ఢీకొని ఆత్రం మహేష్, తోరం వెంగల్‌రావు, దున్న నరసింహులు అక్కడికక్కడే మృతి చెందారు. నిఖిల్, రాజ్ కుమార్లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 అంబులెన్స్ లో కాగజ్నగర్ ఆసుపత్రికి తరలించారు దీంతో మూడు కుటుంబాల్లో విషాద ఛాయలు నెలకొన్నాయి సంఘటన స్థలంలో కుటుంబ సభ్యుల రోధనలు విన్నంటాయి.

మద్యం మత్తులోనే ప్రమాదాలు..!

మద్యం మత్తులోనే తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పోలీసుల నివేదికలు సైతం ఇవే ధృవీకరిస్తున్నాయి. సుమారు 80శాతం నేరాలు మద్యం మత్తులోనే జరుగుతున్నాయని తెలుస్తోంది. ప్రధానంగా 35 ఏళ్లలోపు వయసు వారు అధికంగా మద్యానికి బానిసలు అవుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. చెడు వ్యసనాలకు బానిసలు అయిన వారే నేర ప్రవృత్తి వైపు ఆకర్షితులవుతున్నారనేది తరుచూ వినిపిస్తోంది. నేరాలను తగ్గించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తూనే మరోవైపు మద్యం అమ్మకాల్లో పురోగతి సాధించాలని లక్ష్యాలను విధిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోపక్క రోడ్డు ప్రమాదాల నివారణకు అధికార యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకోకపోవడం కారణంగానే తరచూ ఘటనలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలున్నాయి. 2023-24 సంవత్సరంలో ఆసిఫాబాద్ డివిజన్లో 66 ప్రమాదాలు జరగగా కాగజ్‌నగర్ డివిజన్లో 69 ప్రమాదాలు జరిగినట్లు పోలీసుల రికార్డులు చెబుతున్నాయి. ఇందులో తీవ్రమైన రోడ్డు ప్రమాదాలు 57 కాగా, సాధారణమైన రోడ్డు ప్రమాదాలు 56గా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. రోడ్డు ప్రమాదాలపై పటిష్టమైన చర్యలు తీసుకొని రోడ్డు ప్రమాదాలను నివారించే విధంగా చూడాలని ఉన్నతాధికారులు పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ రోడ్డు ప్రమాదాల్లో 60శాతం యువతే ప్రాణాలు కోల్పోతున్నట్లు తెలుస్తోంది. బెజ్జూర్ మండలంలో సంవత్సర కాలంలో సుమారుగా 10 నుంచి 12 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించడంతో వారి కుటుంబాల్లో తీరని శోకం మిగిలింది. మద్యం మత్తు, వాహనాల అతి వేగం కారణంగానే ఈ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయనే అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది.



నరసింహ(ఫైల్)

అగ్నిప్రమాదంలో కాలిబూడిదైన ఇల్లు

- కట్టుబట్టలతో రోడ్డునపడ్డ కుటుంబం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

అనుకోని అగ్నిప్రమాదం ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబం పనులకు వెళ్లి వచ్చేసరికి తమ ఇల్లు పూర్తిగా దగ్ధమై కనిపించింది. ఇంట్లోని గ్యాస్ సిలిండర్ లీకేజీతో మంటలు చెలరేగాయి. ఇంట్లోని నగదు, బంగారు, వెండి ఆభరణాలు, వస్తు సామాగ్రి, నిత్యావసర సరుకులు కాలిబూడిద కావడంతో బాధిత కుటుంబానికి కట్టుబట్టలే మిగిలిన ఘటన మండలంలోని బారెగూడలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బారెగూడ గ్రామానికి చెందిన మందాడె రాజన్న, భార్య జ్యోతి, తల్లి లక్ష్మి పిల్లలతో కలిసి బారెగూడ శివారులోని చేనులో వ్యవసాయ పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గ్యాస్ లీకేజీతో మంటలు చెలరేగాయి. మంటలు ఎగిసి పడటంతో ఇరుగు, పొరుగు గమనించి మంటలను ఆర్పివేసే ప్రయత్నం చేశారు. అంతలోనే అగ్నిమాపక శకటం ఘటన స్థలానికి చేరుకుంది. ఆలోపే బాధితుని ఇళ్లు, ఇంట్లోని నగదు, బంగారు, వెండి ఆభరణాలు, ఇతర వస్తుసామాగ్రి కాలిబూడిదైంది. ఈ ప్రమాదంలో బాధిత కుటుంబానికి కట్టుబట్టలే మిగలగా నిరాశ్రయులయ్యారు. ఇరుగు, పొరుగు, అగ్ని మాపక సిబ్బంది మంటలను ఆర్పివేయడంతో ఘటన స్థలానికి ఇరువు వైపుల ఉన్న ఇండ్లను ప్రమాదం నుండి కాపాడారు. ఘటన స్థలాన్ని ఎంఆర్ఐ ఖలీల్, రూరల్ ఎస్సై సోనియా, మాజీ సర్పంచ్ గుర్రె సంతర్ పరిశీలించారు. పంచనామా అనంతరం ఈ ప్రమాదంలో రూ. రెండు లక్షల నగదు, బంగారు, వెండి ఆభరణాలు, వస్తుసామాగ్రి కాలిపోవడంతో బాధిత కుటుంబానికి రూ.12 లక్షల మేరకు ఆస్థి నష్టం వాటిల్లినట్టు ఎంఆర్ఐ ఖలీల్ తెలిపారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంఆర్ఐ ఖలీల్

వేసవి క్రీడల శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడల శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి జీఎం ఎస్.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలోని శ్రీ భీమన్న మైదానంలో వేసవి క్రీడల శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మే 20వ తేదీ వరకు ఈ శిక్షణ శిబిరం ఉంటుందన్నారు. వేసవి క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు ఫుట్‌బాల్, వాలీబాల్, అథ్లెంటిక్స్‌ను విద్యార్థులు ఉత్సాహంగా సాధన చేయాలని సూచించారు. బెల్లంపల్లి ఏరియాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఎస్.తిరుపతి, డీజీఎం ఎస్ తిరుపతి, సీహెచ్‌పీ డీజీఎం భీంరావు జాడె, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సివిల్ ఈఈ రాజేంద్రప్రసాద్, సీనియర్ పర్సనల్ అధికారి డి.ప్రశాంత్ పాల్గొన్నారు.

వేసవిలో హాస్టల్ వర్కర్లకు వేతనం చెల్లించాలి




అధికారికి వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో కొనసాగుతున్న పాఠశాలలో పనిచేస్తున్న డైలీ వైస్, పార్ట్ టైం వర్కర్లకు వేసవిలో వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు కృష్ణమాచారి డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రమాదేవికి హాస్టల్ వర్కర్లతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన హాస్టల్‌లో పనిచేస్తున్న వర్కర్‌లను పర్మనెంట్ చేయాలన్నారు. వేసవిలో వేతనం లేకపోవడంతో కార్మికులు కుటుంబ పోషణ భారంగా మారిందని, వెంటనే వేసవి కాలంలో వేతనం చెల్లించేలా ఉత్తర్వులు విడుదల చేయాలన్నారు. డైలీవైస్ వర్కర్లకు కలెక్టర్ జీఓ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, పార్ట్ టైం వర్కలకు వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలల హాస్టల్స్ డైలీవేస్ వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టేకం ప్రభాకర్, జిల్లా అధ్యక్షులు ఆడ శ్యాంరావ్, ఉపాధ్యక్షులు అరిగెల కోటయ్య, జిల్లా నాయకులు చంద్రయ్య, నానాజీ, లత, మంగక్క, శేషాబాయి పాల్గొన్నారు.

నేడు బీసీ సామాజిక సమ్మేళనం



నవతెలంగాణ-సిర్పూర్(టి)

కాగజ్‌నగర్ పట్టణంలోని పటేల్ గార్డెన్‌లో బీసీ సామాజిక సమ్మేళనాన్ని శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చపిడె సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీలు ఐక్యంగా ఉండాలనే బీసీ సంక్షేమం కోసం ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాల గురించి, బీజేపీ ప్రభుత్వం బీసీ సామాజిక వర్గానికి చేస్తున్న కార్యక్రమాలను సమ్మేళనంలో చర్చించనున్నామన్నారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఓబీసీ ఇన్‌చార్జి రాదేశ్యామ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంజయ్, సిర్పూర్ శాసన సభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు వస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని బీసీ నాయకులు, సోదర, సోదరీమనులు తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు గుల్బం నారాయణ, పార్లమెంటు అసెంబ్లీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, మీడియా ఇన్‌చార్జి తుమ్మె సురేష్ పాల్గొన్నారు.

మంత్రి సీతక్క సభను విజయవంతం చేయండి

నవతెలంగాణ-బెజ్జూరు

మండలంలో గొల్లబాయి చెరువు ప్రాంతం వద్ద శనివారం ఏర్పాటు చేసే బహిరంగ సభకు మంత్రి సీతక్క హాజరవుతారని, మండలంలోని ప్రజలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ కోరారు. శుక్రవారం సభ స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు మంత్రి సీతక్క, ఎంపీ అభ్యర్థి సుగుణక్క బెజ్జూరుకు వస్తున్నారని తెలిపారు. రాబోయేది ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ జెండానే ఎగురువుతుందని, అత్యధిక మెజార్టీతో సుగుణక్క ఎంపీ అభ్యర్థిగా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పదేండ్ల బీజేపీ పాలనలో జిల్లాకు ఒరింగేమి లేదన్నారు. దేవుళ్ల పేరుతో బీజేపీ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. యువతకు ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి పదేండ్ల కాలంలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. మరోసారి ప్రజలను మోసం చేయడానికి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు అడగడానికి వస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలపై ప్రజలు బీజేపీ నాయకులను నిలదీయాలని పిలుపు నిచ్చారు. బీఆర్ఎస్ చేసిన మోసాలను కూడా ఎండగట్టాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత కాంగ్రెదన్నారు. ఆరు గ్యారెంటీలతో ప్రజలకు మేలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గుర్తించి చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆ దిశగా పార్టీ శ్రేణులు కూడా క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బూస శంకర్, కోఆప్షన్ సభ్యుడు భశరత్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు దోకె వెంకన్న, పుల్లూరి సతీష్, నాహెర్ అలీ, అబ్దుల్ హకీం, తంగడిపెల్లి మహేష్, నరేందర్‌గౌడ్, వాహిద్‌హుస్సేన్ పాల్గొన్నారు.



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్

కోమటిగూడలో కాంగ్రెస్ ప్రచారం

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కోమటిగూడ గ్రామంలో మండల అధ్యక్షుడు గుర్నులే నారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు గుర్నులే నారాయణ, మండల యూత్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం పనిచేసే పార్టీ అని అన్నారు. దేశాభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ చేతి గుర్తుకు ఓటు వేసి ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. సుగుణను పార్లమెంటుకు పంపిస్తే మనవంతుగా ఈ ప్రాంత సమస్యలపై గలమెత్తి అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఐదు గ్యారెంటీల గురించి ప్రజలకు వివరించారు. ఇందులో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్షణపై సింగరేణి ఉద్యోగులకు అవగాహన

నవతెలంగాణ-కాసిపేట



మందమర్రి ఏరియాలోని కాసిపేట 1వ గనిపై శుక్రవారం రక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సింగరేణి ఉద్యోగులకు అవగాహన కల్పించారు. బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘు కుమార్, ఎస్వీఎం భూశంకరయ్య మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుతున్న క్రమంలో ప్రమాదాలను నివారించడంలో పలు సూచనలు చేశారు. హెల్మెట్ ధరించాలని, కారులో వెళ్లే బెల్టు పెట్టుకోవాలని, ప్రతి కార్మికుడు రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలన్నారు. ఉద్యోగులు క్షేమంగా ఉంటేనే కార్మిక కుటుంబాలు, సంస్థ కూడా ఆనందంగా ఉంటుందన్నారు. అనంతరం సేఫ్టీ జీఎం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, పిట్ సహాయ కార్యదర్శి పార్వతి సురేశ్, సేఫ్టీ కమిటీ సభ్యులు ఆడెపు రవీందర్, రఘురాం, జాడి తిరుపతి, రాజన్న, ఆంజనేయులు, సతీష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎంపీగా గడ్డం వంశీకృష్ణను గెలిపించాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని 15వ వార్డులో కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల అమలుపై ఓటర్లకు అవగాహన కల్పించారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీగా గడ్డం వంశీకృష్ణని గెలిపించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని, చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ ఎంపీగా గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు షాహిద్ అలీ, కౌన్సిలర్ సజ్జు, అబ్బు బాయ్, రమేష్, వార్డ్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలకు పరిష్కారం కనుగొనడమే ఇన్నోవేషన్

- కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్

ప్రకృతిలోనే అనేక ఆవిష్కరణలుంటాయని, మనం ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారం కనుగొనడమే ఇన్నోవేషన్ అని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోని జిల్లా సైన్స్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సైన్స్ వేసవి శిబిరానికి జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, జిల్లా సైన్స్ అధికారి మధుబాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా సైన్స్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సైన్స్ వేసవి శిబిరం 15 రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థి దశ నుండే ఆవిష్కరణలపై మక్కువ పెంచుకోవాలన్నారు. ఆదిమానవుడి నుండి ఆధునిక మానవుని వరకు మానవులు ఎదుర్కొన్న సమస్యలను వినూత్న ఆవిష్కరణల ద్వారా పరిష్కరించడం జరిగిందని, ఉదయం నిద్ర లేచినప్పటి నుండి రాత్రి పడుకునే వరకు ప్రతి అంశంలో సైన్స్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఆవిష్కరించిన అంశం చిన్నదైనా, పెద్దదైనా సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని సూచించారు. వేసవి శిబిరం నుండి వెళ్లేటప్పుడు పుస్తకాల్లో నేర్చుకున్న సిద్ధాంతపరమైన విషయాలను ఇక్కడ నేర్చుకునే ప్రయోగాత్మక విషయాలను కలిపి అన్వయించుకొని విషయ అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ శిబిరంలో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఉపయోగపడే కృత్యాలు చేయడం ద్వారా వాటిని నిజజీవితంలో ఉపయోగపడే ఆవిష్కర్తలుగా ఎదగాలని, శిబిరం నిర్వహణకు అవసరమైన వనరులను అందించడం జరుగుతుందని తెలిపారు. మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా రోబోటిక్స్ ఆటోమేషన్‌లపై విశాల్, టీబాక్స్, సీనియర్ రోబోటిక్ మెంటర్ అవగాహన కల్పించారు. 2 రోజులు రోబోటిక్స్‌పై శిక్షణ అందిస్తారన్నారు. అనంతరం గురుత్వాకర్షణ శక్తిపై కృత్యాధారంగా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ జాకీర్ హుస్సేన్, కె. తిరుపతి, రాజేశం, ఉపాధ్యాయులు కృష్ణ, కుమార్, హరిప్రసాద్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సైన్స్ ఫెయిర్‌లోని ప్రదర్శనలను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్



ఓపెన్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

జిల్లాలో మే 2 వరకు జరుగనున్న ఓపెన్ ఇంటర్, 10వ తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్యతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో 10వ తరగతి కోసం 2, ఇంటర్ కోసం 3 పరీక్షా కేంద్రాలు, బెల్లంపల్లిలో 10వ తరగతి కోసం 1 , ఇంటర్ కోసం 2 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఓపెన్ స్కూల్ 2వ రోజున 10వ తరగతిలో మొత్తం 639 మంది విద్యార్థులకు గాను 530 మంది, ఇంటర్లో 1 వేయి 141 మంది విద్యార్థులకు గాను 976 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఉదయం 9 గం.ల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుండి 5.30గంటల వరకు పరీక్షలుంటాయన్నారు. ప్రశ్నాపత్రాలు, జవాబుపత్రాల తరలింపుకు బందోబస్తు ఏర్పాట్లతో పాటు పరీక్షలలో ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షా కేంద్రాలలో తాగునీరు, మూత్రశాలలు, పారిశుద్ధ్యం, నిరంతర విద్యుత్ సరఫరా సౌకర్యాలు కల్పించడంతో పాటు అత్యవసర సేవల నిమిత్తం వైద్య సిబ్బందిని, వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులను అందుబాటులో ఉంచామన్నారు. జిల్లా విద్యాధికారి 2 పరీక్షా కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 8 పరీక్షా కేంద్రాలను సందర్శిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రేపు టైగర్‌జోన్ ఆంక్షలపై రౌండ్ టేబుల్ సమావేశం



నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్ అటవీశాఖ ఆంక్షలు ఎత్తివేయడానికి కార్యాచరణ రూపొందించడానికి ఈనెల 28న మండల కేంద్రంలోని పొన్కల్ మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరుగుతుందని సామాజిక ఉద్యమకారుడు శ్రీరాముల భూమాచారి తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన పత్రిక విలేకరులతో వారు మాట్లాడుతూ రాష్ట్ర అటవీశాఖ లక్షెటిపేట్ నుండి దండేపల్లి, జన్నారం మీదుగా ఉట్నూరు, ఆదిలాబాదు, కడెం, నిర్మల్ రాష్ట్ర రహదారులపై మన ప్రాంత అభివృద్ధి, ఉపాధి అవకాశాలకు అడ్డంకిగా వాహనాల రాకపోకలపై విధించిన ఆంక్షలను ఎత్తి వేయడానికి కార్యాచరణకి నాలుగు మండలాల విస్తృత స్థాయి రౌండ్ టేబల్ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ రౌండ్ టేబల్ సమావేశానికి జన్నారం, దండేపల్లి, కడెం, ఉట్నూరు మండలాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల అధ్యక్షులు, నాయకులు, వివిధ కుల, వ్యాపార సంఘాలు, వాహన యాజమాన్య, వర్తక, కులవృత్తి, విద్యార్థి సంఘాలు, పాత్రికేయులు, వివిధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

యువత రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనాలి



నవతెలంగాణ-తాండూర్

యువత రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనాలని పెద్దపల్లి పార్లమెంటరీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ తెలిపారు. శుక్రవారం మండలంలో బైక్ ర్యాలీ నిర్వహించి రేచిని అచలాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత రాజకీయాల్లో పాల్గొని అభివృద్ధికి తోడ్పాటునందించాలని సూచించారు. రాజకీయ అంశాలలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చేందుకు తాను అతి చిన్న వయసులో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. యువత కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తన గెలుపుకు సహకరించాలని కోరారు. తాను ఎంపీగా గెలిస్తే నిరుద్యోగ యువతకు, నిరుపేదలు, మహిళలకు విద్యార్థులకు లాభం చేకూరే విధంగా అభివృద్ధి పథకాల అమలుకు కృషి చేస్తానన్నారు. సింగరేణి గోల్డ్ బెల్ట్ ప్రాంత ప్రజలు మాజీ మంత్రి(కాక) కుటుంబ సభ్యునిగా ఎంపీగా గెలిపించి రాష్ట్రంలో రాజకీయ శక్తిగా ఎదిగేందుకు సహకరించాలని కోరారు. పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో ఆరు గారంటీల హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుపరిచేందుకు కృషి చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాలు మహిళలు విద్యార్థులు నిరుద్యోగులకు అన్ని రంగాల్లో అవకాశాలు లభించేలా నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు దోహదపడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఈసా గట్టు మురళీధర్ రావు, ఎంపీటీసీ సూరం రవీందర్, దామోదర్ రెడ్డి, జుబేర్, మాసాడి తిరుపతి, మాసాడి కమలాకర్, కాపర్తి సుభాష్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థినికి ఘన సన్మానం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కరిమల కళాశాలలో (రాఘవేంద్ర విద్యాసంస్థ)లో చదువుకుంటున్న మోకు దెబ్బ గౌడ కులానికి చెందిన విలాసారపు శ్రీవల్లి ఇటీవల వెలువడిన ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్షలలో 1000కి 982 మార్కులతో రాష్ట్రస్థాయి ఎనిమిదో ర్యాంకు సాధించింది. శుక్రవారం మండల కేంద్రంలో మోకు దెబ్బ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆమెకు శాలువా పూలమాలతో సత్కరించారు. భవిష్యత్తులో మరెన్నో ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని గౌడ సంఘం నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోన్కల్ పట్టణ గౌడ సంఘం అధ్యక్షులు పోడేటి సతీష్ గౌడ్, బాలసాని శ్రీనివాస్ గౌడ్, ఎరుకల రమేష్ గౌడ్, జిల్లా అధ్యక్షులు వోల్లాల నర్సగౌడ్, నాయకులు గర్రెపల్లి కిషోర్ గౌడ్, గొల్లపెల్లి రమేష్ గౌడ్, డాక్టర్ వెంకటేశ్వర్ గౌడ్, కోట రవి గౌడ్, మాజీ సర్పంచ్ బూషనవేని గంగాధర్ గౌడ్, ఎరుకల రాజు గౌడ్ పాల్గొన్నారు.

ఆశీర్వదిస్తే పార్లమెంట్లో మీ గొంతునవుతా..!

- పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ



రోడ్ షోలో మాట్లాడుతున్న పెద్దపెల్లి ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ

నవతెలంగాణ-కాసిపేట

దోచుకునే నాయకులం కాదు, ప్రజా సేవ చేయడానికి రాజకీయల్లోకి వచ్చా, ఆశీర్వదిస్తే పార్లమెంట్లో మీ గొంతును అవుతానని, మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కాసిపేట, ముత్యంపల్లి, దేవాపూర్, కొండాపూర్ యాప గ్రామాలల్లో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, మాజీ మంత్రి వేణు గోపాలాచారితో కలిసి రోడ్ షో నిర్వహించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ రైతు సమస్యల పట్ల బీఆర్ఎస్, బీజేపీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ధ్వజమెత్తారు. గతంలో రైతులకు రుణ మాఫీ చేసిందే కాంగ్రెస్ ప్రభుత్వమని, ఆగస్టు 15లోపు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తారని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. గత పదేండ్లుగా పేద ప్రజల కడుపు కొట్టి బీఆర్ఎస్ పార్టీ మోసం చేసిందన్నారు. పిల్లలు డిగ్రీలు, పీజీలు చేసి ఆటోలు నడుపుకునే పరిస్థితి దాపురించందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలం చేందాయని విమర్శించారు. కాంగ్రెస్ గ్యారంటీల విషయంలో ఇచ్చిన హామీలు నిలబెట్టుకుందన్నారు. త్వరలో గృహా లక్ష్మీ గ్యారంటీ కూడా అమలు చేస్తుందన్నారు. విశాఖ, కాకా ట్రస్టుల ద్వారా ఎన్నో సేవ కార్యక్రమాలు, నీటి సమస్య, పాఠశాలల్లో వసతుల విషయంలో చాలా కృషి చేశామన్నారు. యువత ఉద్యోగం లేకపోతే ఎంత ఆవేదన చెందుతారో తనకు తెలుసని, కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కృషి చేస్తానన్నారు. ఇప్పటికే 500 మంది నిరుద్యోగులకు మా సంస్థలో ఉద్యోగ ఉపాధి అవకాశం కల్పిస్తున్నామని, అందులో సింగరేణి కార్మికుల పిల్లలే అధికంగా ఉన్నారన్నారు. కాకా, వివేక్‌ల సంస్థలే కాకుండా నా స్వయం కృషితో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, మాజీ సహకార సంఘం చైర్మన్ పూస్కూరి వంశీకృష్ణారావు, కార్యదర్శి మైదం రమేశ్, గోలేటి స్వామి, నాయకులు సాపాటు శంకర్, రాపర్తి శ్రీనివాస్, సిద్ధం తిరుపతి, మేడ సమ్మయ్య, మాజీ జడ్పీటీసీ రౌత్ సత్తయ్య, పుర్ర కుమారస్వామి యాదవ్, ముత్యంపల్లి టౌన్ ప్రెసిడెంట్ దారవేణి రాజయ్య యాదవ్, మంద వెంకటేశ్, మారం రాజ్ కుమార్, జాడి శివ, ఎల్పుల వెంకటేష్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్ ఫోన్ పోగొట్టుకున్న తాండూర్ మండలం తంగళ్లపల్లికి చెందిన రాదండి రమేశ్‌కు సెల్ ఫోన్‌ను అప్పగించినట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఏప్రిల్ 5న సామ్‌సాంగ్ సెల్ ఫోన్ పోగొట్టుకోగా గుర్తించి శుక్రవారం సెల్ ఫోన్ యాజమానికి అందించినట్లు వివరించారు.

రేపు సబ్ జూనియర్, జూనియర్ జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-నస్పూర్

జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 28న విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేంద్రపాణి, ట్రెజరర్ చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీ బండి తిరుపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలలో ఎంపికైన వారు మంచిర్యాల జిల్లా ప్రీమియర్ లీగ్ కబడ్డీ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఆసక్తిగల కబడ్డీ క్రీడాకారులు ఉదయం 9 గంటలకు ఆధార్ కార్డు, రూ. 100 ఎంట్రీ ఫీజు తీసుకొని పీఈటీ సదానందంకు రిపోర్ట్ చేయాలన్నారు. ఇతర సమాచారం కోసం సెల్ నంబర్ 9849124856 సంప్రదించాలన్నారు.

నేడు మంచిర్యాలకు దీపదాస్ మున్షి

- మంచిర్యాల, నస్పూర్‌లో ప్రజా ఆశీర్వాద సభ

నవతెలంగాణ-మంచిర్యాల

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శనివారం మంచిర్యాల, నస్పూర్‌లో ఏర్పాటు చేసిన సభలను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నియోజక వర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మంచిర్యాలలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ మంచిర్యాలలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలో ప్రజా ఆశీర్వాద సభ, నస్పూర్ పరిధిలో కార్మిక గర్జన సభ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సభలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దీపదాస్ మున్షి, ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు శివసేన రెడ్డి, ఎమ్మెల్యేలు, తదితరులు ముఖ్య నేతలు హాజరుకానున్నట్లు తెలిపారు. సభలకు జిల్లాలోని పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఎన్నికల సందర్భంగా విపక్ష పార్టీలు తప్పుడు సమాచారం ఇస్తూ తనపై అక్రమ కేసులు నమోదు చేయిస్తున్నారని ఆరోపించారు. తాను ఎన్నికల నియమావళిని ఎప్పుడు ఉల్లంఘించలేదని వివరణ ఇచ్చారు. ఓ ఆలయంకు విరాళం ఇవ్వడాన్ని వివాదాస్పదం చేయడం తగదన్నారు. వాస్తవాలు తెలుసుకుని ఆరోపణలు చేయాలని ప్రతిపక్షాలకు హితవుపలికారు. తనపై కేసులు కొత్తేమి కాదని విద్యార్థి దశ నుంచి నేటి వరకు ప్రజాక్షేత్ర పోరాటంలో కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గం అభివృద్ధి కోసం భారీ ఎత్తున నిధులు తీసుకువచ్చానని గుర్తు చేశారు. ఎన్నికల కోడ్ లేకపోతే పనులు ప్రారంభం అయ్యేవని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రేమ్ సాగర్ రావు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, పార్టీ నాయకులూ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు

రేపటి జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయండి




నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో 138వ మేడే దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏప్రిల్ 28న నిర్వహించే జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కె.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం వివిధ గనులలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్ సమావేశంలో వారు మాట్లాడుతూ చికాగో అమరవీరులు తమ ప్రాణాలను అర్పించి ఎనిమిది గంటల పని దినాన్ని సాధించారని తెలిపారు. వారి స్ఫూర్తితో సింగరేణిలో కార్మికులు భవిష్యత్తులో నూతన అండర్ గ్రౌండ్ గనుల ఏర్పాటు, సొంత ఇంటి పథకం అమలు, ఐటీ మినహాయింపు తదితర హక్కుల సాధనకై కార్మికులంతా ఐక్యమత్యంగా పోరాటాలు నిర్వహించాలన్నారు. 28న నిర్వహించే సమావేశానికి ముఖ్య అతిథులుగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసఫ్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేనా శంకర్ హాజరవుతారని తెలిపారు. గుర్తింపు కార్మిక సంఘంగా భవిష్యత్ పోరాటాలను, కార్యాచరణను రూపొందించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్ రావు, బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఫిట్ కార్యదర్శిలు మురళి చౌదరి, బీర రవీందర్, గునిగంటి నర్సింగారావు, దాడీ రాజయ్య సంఘం సదానందం, అఫ్రోజ్ ఖాన్, మోతే లచ్చయ్య, ఆకుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | ఏప్రిల్ 27, 2024 | www.navatelangana.com

వాహనాలను తనిఖీ చేసిన ఎస్సై

నవతెలంగాణ-సిరికొండ



పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం ఎస్సై నవీన్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనదారులకు, ప్రయాణికులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లకూడదని అన్నారు. వాహనాల్లో మద్యం తరలించకూడదని అన్నారు. నగదు రూ.50 వేలకు మించి తీసుకెళ్లకూడదని, ఒకవేళ తీసుకెళ్తే సంబంధిత పత్రాలు తీసుకెళ్లాలని అన్నారు. లేకుంటే డబ్బును సీజ్ చేస్తామని అన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని ఇన్‌కర్ గూడ గ్రామం వద్ద శుక్రవారం జరిగిన కారు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన కుటుంబీకులు గోదావరిఖని నుంచి ఆదిలాబాద్‌లోని సమీప బందువులన ఇంట్లో జరిగే శుభకార్యానికి వెళ్తుండగా, ఈ ప్రమాదం చోటు చేసుకుంది. షిఫ్ట్ డిజైర్ టీఎస్.02 ఎఫ్‌హెచ్7301 నెంబరు గల కారు రోడ్డు పక్కన ఉన్న చెట్లకు రాకుతూ ప్రమాదానికి గురైంది. కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న భవాని(48), సంజన (20), భాను ప్రకాష్(22), తేజస్విని(18) లకు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. వీరిలో సంజనకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోక ముందే స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, చికిత్సకై జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. కారు డ్రైవర్ నిద్రమత్తులో అతివేగంగా నడపడం వల్లనే ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు.

బీజేపీ అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించాలి

- కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ- ఆదిలాబాద్ టౌన్

ఎన్నికల కమిషన్ నియమావళికి అనుగుణంగా నామినేషన్ పత్రాలను దాఖలు చేయని బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ నామినేషన్‌ను తిరస్కరించాలని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఈ విషయమై ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. అనంతరం కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోడం నగేష్ తన కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలను అఫిడవిట్‌లో పొందుపర్చకుండా ఖాళీగా వదిలేశారన్నారు. ఈసీ నిబంధనల ప్రకారం ఇలా చేస్తే నామినేషన్ తిరస్కరించాలని, కానీ అధికారులు ఆమోదించడం ఎంతవరకు సమంజసమన్నారు. దీనిపై రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లినా ఫిర్యాదును స్వీకరించే పరిస్థితి లేదన్నారు. ఎన్నికల అధికారులు స్పందించి వెంటనే ఆయన నామినేషన్‌ను తిరస్కరించాలని డిమాండ్ చేశారు. అధికార యంత్రాంగం నిబంధనలకనుగుణంగా వ్యవహరించాలని, ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా ఉండకూడదన్నారు. ఈ విషయమై ఇప్పటికే తమ పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లామని దీనిపై రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో పాటు న్యాయ పోరాటం చేస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నామినేషన్‌ను ఆమోదించడం అధికార దుర్వినియోగమేనని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, కౌన్సిలర్ దర్శనాల లక్ష్మణ్, నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలతో ముందుకెళ్లాలి



నవతెలంగాణ-బోథ్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలతో ప్రతి ఒక్క కార్యకర్తలకు ముందుకు వెళ్లి ప్రచారాన్ని నిర్వహించాలని, ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. మండలంలోని చింతలబోరి గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం చేపట్టిన ప్రజా యాత్రలో నాయకుడు ఏలేటి అశ్విన్‌రెడ్డి గడపగడపకి మన కాంగ్రెస్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనతోనే అభివృద్ధి సాధ్యమని, గ్రామంలో చాలావరకు ఇందిరమ్మ ఇండ్లే ఉన్నాయని, అన్నారు. రానున్న రోజుల్లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఆ గ్రామం అభివృద్ధి చెందిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సదాశివ్, కిరణ్ ముండే, శ్రీధర్ ముండే, రాజేందర్, దోండిబా, రవికాంత్, సత్యనారాయణ, గ్రామ పటేల్, గాజుల పోతన్న, విజయ భాస్కర్‌రెడ్డి, కసిరే పోతన్న, సంఘపాల్, ఎంపీటీసీ పాల్గొన్నారు.

రూ.1.80 లక్షల నగదు పట్టివేత



నవతెలంగాణ-జైనథ్

మండలంలోని పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా ఇంటర్ స్టేట్ బార్డర్ చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా శుక్రవారం అమిత్ సుధాకర్ సర్కె మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన వ్యక్తి తను కారులో ఎలాంటి రసీదులు లేకుండా హైదరాబాద్‌కు రూ.లక్ష తీసుకోని వెళుతుండగా పోలీసులు పట్టుకున్నారు. అదేవిధంగా రిషి తానే, మహారాష్ట్రకు చెందిన నాగపూర్ గ్రామవాసి తన కారులో హైదరాబాద్ వెళుతుండగా ఎలాంటి రసీదులు లేని రూ80వేలను పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ. 1.80లక్షలను సీజ్ చేసి, డిస్టిక్ గ్రీవెన్స్ టీమ్‌కు సీఐ డి.సాయినాథ్‌కు అప్పగించామని తెలిపారు. అతని వెంట ఎస్సై పురుషోత్తం ఉన్నారు.

వడదెబ్బ తగిలి ఎమ్మెల్యేకు అస్వస్థత

నవతెలంగాణ-నేరడిగొండ

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురయ్యారు. గత రెండు నెలలుగా నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. ఎండ వేడిమికి వడదెబ్బ తగిలి ప్రస్తుతం ఇంట్లో చికిత్స తీసుకుంటున్నారు. అస్వస్థత కారణంగా చికిత్స పొందుతున్నాడు. నియోజకవర్గ ప్రజలు దీనిని గమనించాలని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎవరు కూడా అనవసరంగా బయటకు రావద్దని అన్నారు. బోథ్ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు అందరూ ఉదయాన్నే ప్రచారం నిర్వహించి, మళ్లీ ఎండ తగ్గిన తరువాత సాయంత్రం గ్రామాల్లోకి వెళ్లి ప్రచారం నిర్వహించాలని అన్నారు.

పది మంది నామినేషన్లు తిరస్కరణ



నవతెలంగాణ- ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్ లోక్‌సభ బరిలో నిలిచేందుకు ఆయా పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు దాఖలు చేసిన వాటిలో 10మంది అభ్యర్థుల నామినేషన్లను ఎన్నికల అధికారి తిరస్కరించారు. అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను శుక్రవారం సాధారణ పరిశీలకుడు రాజేంద్ర విజయ్‌తో కలిసి జిల్లా రిటర్నింగ్ అధికారి రాజర్షి షా పరిశీలించారు. ఈ సందర్భంగా 23మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా ఇందులో 13మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందాయని.. 10 నామపత్రాలు తిరస్కరణకు గురయ్యాయని రిటర్నింగ్ అధికారి తెలిపారు. మొత్తం 42 సెట్లలో 27కి ఆమోదం లభించగా.. 15 సెట్లు తిరస్కరణకు గురయ్యాయని వివరించారు. నామినేషన్లు ఆమోదం పొందిన వారిలో మాలోతు శ్యామ్‌లాల్ నాయక్ (అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ), రాథోడ్ సుభాష్ (స్వతంత్ర), ఆత్రం సుగుణ(కాంగ్రెస్), మెస్రం గంగాదేవీ(డీఎస్‌పీ), ఆత్రం సక్కు (బీఆర్ఎస్), గేడం సాగర్ (ఇండియా ప్రజాబంధు), గోడం నగేష్(బీజేపీ), కొడప వామన్ రావు (గోండ్వాన దండకారణ్య పార్టీ), భుక్యా జయవంత్‌రావు(స్వతంత్ర), సునావత్ తిరుపతి (విద్యార్థుల రాజకీయ పార్టీ), రాథోడ్ రాజు (స్వతంత్ర), చవాన్ సుదర్శన్ (అన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ) మెస్రం జంగు బాపు(బీఎస్‌పీ)ల నామినేషన్లకు ఆమోదం లభించగా.. తిరస్కరించిన వాటిలో చవాన్ రామ్ (స్వతంత్ర), రాథోడ్ రమేష్ (బీజేపీ), నేతావత్ రాందాస్(స్వతంత్ర), కుమరం మంతయ్య(స్వతంత్ర),పెందూర్ సుధాకర్(స్వతంత్ర), ధరావత్ నరేంధర్(బీఆర్ఎస్), ఆత్రం భాస్కర్(కాంగ్రెస్), నైతం రవీందర్(స్వతంత్ర), మడావి వెంకట్‌రావు(రాష్ట్రీయ మానవ్ పార్టీ), ఆత్రం భీంరావు(స్వతంత్ర) అభ్యర్థులు ఉన్నట్లు తెలిపారు.

చట్ట వ్యతిరేకమైన నేరాలపై చర్యలు

నవతెలంగాణ-నస్పూర్

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామగుండం కమిషనర్ పరిధిలో గంజాయి అక్రమ రవాణ, పీడీఎస్ రైస్, ఇసుక అక్రమ రవాణ, నకిలీ విత్తనాల అక్రమ రవాణ, పేకాట, కోడి పందాలు ఆడేవారిపై, గుడుంబా తయారీ, అక్రమ రవాణ, అనుమతి లేని చిట్ ఫండ్స్, భూ కబ్జాలకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం, అనుమతి లేని లే అవుట్ వెంచర్స్ నిర్మాణం, ఇతర చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా పెట్టి పూర్తిస్థాయిలో రూపుమాపేందుకు కఠినంగా వ్యవహరిస్తామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని, చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడుతూ ప్రజలకు నష్టం జరిగే పనులు చేసే వారికి చట్ట పరిధిలో శిక్ష తప్పదని తెలిపారు. పీడీ యాక్టు అమలుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడే కొంతమంది వ్యక్తుల జాబితా సిద్ధం చేశామని పేర్కొన్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టో ఐదు గ్యారంటీ కరపత్రాలు విడుదల

నవతెలంగాణ-జన్నారం

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు పార్టీ మేనిఫెస్టో ఐదు గ్యారంటీ స్కీములకు చెందిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దేశానికి చేసిందేమి లేదన్నారు. బీజేపీ మరోసారి గెలిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్లు తీసివేయడం ఖాయమన్నారు. వచ్చే ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏనుగు సుభాష్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఫసి ఉల్లా, పట్టణ అధ్యక్షుడు దుమాల్ల రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇందయ్యా, జన్నారం ఎంపీటీసీ రియాజోద్దీన్, కోలా పద్మ రావు, సాదుపాషా, రియాసత్ అలీ, మంద రాజేష్, అజ్మాత్ ఖాన్,అల్లునూరి పద్మ రావు, లకావత్ తిరుపతి, సయ్యద్ రఫీల్లా, నోముల రాజు, ఎస్‌కే అజహర్, అల్లం పెద్దులు మాలాన రాజేశం, గంగన్న పాల్గొన్నారు.



ఆత్రం సుగుణను గెలిపించాలి

ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్ మొట్టమొదటిసారిగా మహిళలకు అవకాశం ఇచ్చినందుని, ఆమె గెలిపించుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని మాజీ జడ్పీటీసీ టేకుమెట్ల పంకజ అన్నారు. శుక్రవారం మండలంలోని కోలాంగూడ, గుండుగూడ, తదితర గిరిజన గ్రామాల్లో పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ తరపున ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం ఉపాధి హామీ కూలీలకు చేతి గుర్తుకు ఓటు వేయాలని సూచించారు.

హ్యాండ్ బాల్ ప్రీమియర్ లీగ్ విజేతలకు బహుమతులు



నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్‌లోని సాధన ఎక్సలెన్సియా పాఠశాలలో తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా మొదటి తెలంగాణ హ్యాండ్ బాల్ ప్రీమియర్ లీగ్ పోటీలు సాగుతున్నాయి. శుక్రవారం ముగింపు సందర్భంగా విజేతులకు బహుమతులను అందజేశారు. ఈ పోటీలలో పురుషుల విభాగంలో వరంగల్ జట్టు మొదటి బహుమతి, హైదరాబాద్ రెండవ బహుమతి, ఆదిలాబాద్, నిజామాబాద్ మూడో బహుమతి కైవసం చేసుకున్నాయి. మహిళల విభాగంలో మొదటి బహుమతి కరీంనగర్, రెండవ బహుమతి హైదరాబాద్, మూడవ బహుమతి మహబూబ్ నగర్ జట్లు సాధించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు, సాధన గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ పెంచాల శ్రీధర్, అడ్వకేట్ దామోదర్ లాల్ బంగ్, భూపతి మధుకర్, గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయం డైరెక్టర్, సాధన గ్రూప్ ఆఫ్ స్కూల్ అడ్వైజర్ పెంచాల వేణు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ టీం హ్యాండ్ బాల్ కోచ్ టోర్నమెంట్ కన్వీనర్ బొడ్డు విష్ణువర్ధన్, జిల్లా సెక్రటరీ తుండ్ల శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాస్, సాధన గ్రీన్ కిడ్స్ పాఠశాల ప్రిన్సిపల్ పెంచాల సంధ్య, సాధన ఎక్సలెన్సియా పాఠశాల ప్రిన్సిపల్ రాంపురం నరేష్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రేమ్‌సాయి, సీనియర్ క్రీడాకారులు గడ్డం సాయికుమార్, వంశీకృష్ణ, శివాజీ, సైనిక్ స్పోర్ట్స్ క్లబ్ సెక్రటరీ శీలం సాయికుమార్ పాల్గొన్నారు.

రాజకీయాల్లో సమాన హక్కులు కల్పించాలి

- దళిత హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు జాదవ్ శేఖర్

నవతెలంగాణ-నార్నూర్

ఏజెన్సీ గ్రామాల్లో 50శాతం పైన జనాభా ఉంటే ఆ గ్రామంలో దళితులకు రాజకీయాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోటీ చేయడానికి అర్హులుగా ప్రభుత్వం సమాన హక్కులు కల్పించాలని దళిత హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు జాదవ్ శేఖర్ అన్నారు. శుక్రవారం ఖంపూర్ గ్రామంలో 57 కులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు ఖైరి వెంకటేష్ ఆదేశాల ప్రకారం గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో దళితులు చాలా వెనుకబడి ఉన్నారని వారికి రైతుబంధు, రైతుభీమా, భూపహనీలు, క్రాప్‌లోన్, కులాల వారీగా కార్పొరేషన్ లోన్ కేంద్రప్రభుత్వం ఇస్తేనే జిల్లా పార్లమెంట్ అభ్యర్థులకు దళిత సమాజం ఎన్నికల్లో పూర్తి మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. వీటితో పాటు రాజకీయంలో రిజర్వేషన్ ప్రకారం సమాన హక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అన్నాభావు సాఠే జిల్లా నాయకులు పరమేశ్వర్, సభ్యులు మధుకర్, అమర్ నాథ్, విజయ్, అంబాదాస్, సురేష్, చంద్రకాంత్ ఉన్నారు.



చెక్‌పోస్ట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని మహారాష్ట్ర సరిహద్దులోని లక్ష్మీపూర్ చెక్ పోస్ట్‌ను శుక్రవారం జిల్లా పోలీసు అధికారి గౌస్‌ఆలం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ చెక్‌పోస్ట్ అధికారులకు పలు సూచనలు సూచించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించి వీడియో రికార్డు నిర్వహించి తనిఖీలు నిర్వహించాలన్నారు. మహారాష్ట్ర సరిహద్దు కావడంతో అప్రమత్తంగా ఉండాలని చెక్‌పోస్ట్ సిబ్బందిని ఆదేశించారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకురావాలని సిబ్బందిని కోరారు. అనంతరం మహారాష్ట్రలోని పిప్పల్‌గావ్ చెక్‌పోస్ట్ వద్దకు వెళ్లి అక్కడ సిబ్బందితో మాట్లాడి ఎన్నికల కోడ్ దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా పోలీసు అధికారి వెంట రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఫణీధర్ సిబ్బంది ఉన్నారు.

బస్సును ఢీకొన్న బైక్ ఇద్దరి పరిస్థితి విషమం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని ధనోర(బి) గ్రామ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో చోర్‌గావ్‌కు చెందిన దుర్వ చందు(27), ఆడ మదుకర్(30)లకు కాళ్లు, చేతులు విరిగి పోయాయి. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రవెల్లి నుంచి గుడిహత్నూర్ వైపు వెళ్తున్న బైక్ ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో ఒకరి కాలు విరిగి నుజ్జు నుజ్జు కాగా, ఇంకొకరి కాలు, చేయి విరిగి నుజ్జు నుజ్జు అయింది. పోలీసులు క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించగా అక్కడి డాక్టర్ల సూచన మేర పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించినట్టు సమాచారం. పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-బోథ్

పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన గుమ్ముల జస్వంత్(19) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రభుత్వ ఉద్యోగం రావటం లేదని మనస్తాపం చెంది పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయనను బోథ్ సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. తల్లి శోభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాము తెలిపారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

త్వరలో జిల్లాలో పరివర్తనలో భాగంగా భీంరావు మహారాజ్ పాదయాత్ర చేపడుతున్నారని, ఈ పాదయాత్రను విజయవంతం చేయాలని ఎల్మల నగేష్ అన్నారు. శుక్రవారం యాపల్‌గూడలో పరివర్తనలో భాగంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహారాజుల కాలనీల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. త్వరలో భీంరావు మహారాజ్ 24వేల కిలోమీటర్ల పాదయాత్ర చేడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ జాగృతి సంఘ నాయకులు రవి మహారాజ్, యాపల్ గూడ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా వేడుకలను ఘనంగా జరుపుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని రవీంద్ర నగర్‌లో నూతనంగా నిర్మించిన పోచమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్టాపన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే సతీమణి పాయల్ ఉమతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన హోమాది క్రతువుల్లో పాల్గొని వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు. కాలనీకి చెందిన మహిళలు అమ్మవారికి సామూహిక బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీ వాసులంతా ఐక్యంగా ఉండి ఆలయాన్ని నిర్మించుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తూ ప్రశాంత జీవనాన్ని గడపాలని సూచించారు.

మరోసారి అవకాశం కల్పించి ప్రధానిని చేయండి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశంలో సుపరిపాలన అందిస్తున్న నరేంద్ర మోడీకి మరోసారి అవకాశం కల్పించి మూడవ సారి ప్రధాని చేయాలనీ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం స్థానిక ఇందిరా ప్రియదర్శిని మైదానంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ఆయన ప్రచారం చేపట్టారు. నడక సాధకులను కలిసి సరదాగా వారితో ముచ్చటించారు. కమలం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. పిల్లలతో కలిసి సరదాగా క్రికెట్ ఆడుతూ, వారిని రన్నింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ దేశాన్ని అన్ని రంగాల్లో అభివద్ధి పథంలో నడిపేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశేష కషి చేస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి భారి మెజారిటీ తో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆదినాథ్, అశోక్, లాలా మున్న, జోగురవి, ఆకుల ప్రవీణ్, వేదవ్యాస్, భీం సేన్ రెడ్డి పాల్గొన్నారు.